ప్రతిభే పెట్టుబడి

- విద్యార్థుల విశేష ఆలోచనకు రూ.పది వేలు
- నగదు ప్రోత్సాహకాల అందజేత
- చదువు పూర్తయ్యేంత వరకూ స్కాలర్‌షిప్
- పాఠశాల స్థాయిలో పరిశోధనలు
- అక్టోబర్ 15 వరకూ దరఖాస్తుకు గడువు పెంపు


గతేడాది జాతీయ స్థాయికి ఎంపికైన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్ ప్రాజెక్టు (ఫైల్)

బాలాజీచెరువు: ఓ ఐడియా చదువుకు భరోసా కానుంది. విద్యార్థి ఆలోచన నిర్వాహకులకు నచ్చితే రూ.10 వేలు బహుమతిగా ఇస్తారు. ఆ డబ్బుతో తయారుచేసిన సైన్స్ సంబంధిత ప్రాజెక్టుతో ఆ విద్యార్థి జాతీయ స్థాయి వరకూ నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైతే బంపర్ బొనాంజ తగిలినట్లే. ఉన్నత చదువు పూరయ్యేంత వరకూ స్కాలర్‌షిప్ రూపేణా ప్రభుత్వం తోడ్పాటు నందిస్తుంది. ఇంతటి చక్కని అరుదైన అవకాశం అందిపుచ్చుకోవాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థుల ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్‌లో ప్రాజెక్టుల సారాంశాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అక్టోబర్ 15 వరకూ గడువు పెంచారు.

మేథోశక్తికి పదును పెట్టేలా..

విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మక్కువ పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పేరిట ఏటా రాష్ట్ర, కేంద్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మేథోశక్తికి పదును పెట్టేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 2024–25కు ఇన్‌స్పైర్ అవార్డ్స్–మనాక్ పేరిట సైన్స్ ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ, వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఎంపికైతే రూ.10 వేలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు సైతం ఇన్‌స్పైర్ అవార్డు కోసం తమ ఆలోచనలు పంపించవచ్చు. ఆరు నుంచి పదో తరగతి వరకూ, పది నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గలవారు దీనికి అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో నియమితులైన కమిటీ విద్యార్థులకు పంపించిన అంశాలు పరిశీలించి, మంచి ఆలోచనలు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు వారి ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు.

ఆలోచన చెబితే చాలు

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక ,సమస్యల పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు తమ మేథోశక్తిని రంగరించి, చక్కటి ఆలోచన చెబితే చాలు..దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

అదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల యూడైస్ కోడ్, రెవెన్యూ జిల్లా, విద్యార్థి బ్యాంక్ ఖాతా నంబర్ పొందుపరచాలి.

గత మూడేళ్లు ప్రాజెక్టుల నమోదు ఇలా..

సంవత్సరం	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి	జాతీయ స్థాయి
2021–22	303	14	03
2022–23	279	24	–
2023–24	189	12	01

విద్యార్థులకు ప్రయోజనకరం



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్తులో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా సైన్స్ అధికారులు ఆయా జిల్లాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తున్నాం.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

ప్రతిభను ప్రోత్సహించేలా..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రాజెక్టు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది కంటే అధికంగా పాల్గొనేలా కృషి చేస్తున్నాం.

– ఎం.శ్రీనివాస్ వినీల్, జిల్లా సైన్స్ అధికారి, కాకినాడ

క్లుప్తంగా

జీజీహెచ్‌లో పొగాకు విమోచన కేంద్రం


కాకినాడ జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటైన పొగాకు విమోచన కేంద్రం, చిత్రంలో వైద్యులు

కాకినాడ క్రైం: పొగాకు విమోచన కేంద్రాన్ని మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రారంభించారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. సైకియాట్రీ, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీలు డాక్టర్ ఈ.రామచంద్రరావు, డాక్టర్.పి.సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వైద్యులు వివరించారు. పొగాకు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాల నుంచి జన జీవనాన్ని రక్షించడమే విమోచన కేంద్రాల ముఖ్యోద్దేశమని డాక్టర్ లావణ్య కుమారి చెప్పారు. పొగాకుకు బానిసలైన వారు విమోచన కేంద్రాన్ని ఆశ్రయించి, ఆరోగ్యవంతులు కావాలని సూచించారు.

పటిష్టంగా శరన్నవరాత్ర ఉత్సవాలు


ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్రాజు చౌదరి

బోట్‌క్లబ్: రానున్న శరన్నవరాత్ర ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వి.వీర్రాజు చౌదరి అన్నారు. మంగళవారం ఆయన ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేసే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఏటా శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు. వచ్చే నెల 2 నుంచి 12 వరకూ జరిగే ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

సమాజ సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం


ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లను సత్కరిస్తున్న అడ్డాల

బోట్‌క్లబ్: సమాజ సేవే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ సభ్యులు పనిచేస్తున్నారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంతవైద్యశాలలో ప్రపంచ ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు దివాకర్‌రావు, తేజేశ్వరరావు ను ఘనంగా సత్కరించారు. అడ్డాల మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు చైతన్య, పద్మావతి, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ విడుదల చేయాలి

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ పంచాయతీకి 2022 నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ విడుదల చేయకపోవడంతో గ్రామంలో కనీస వసతులు కరువయ్యాయని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ అన్నారు. రమణయ్యపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అతి పెద్ద పంచాయతీ అయిన రమణయ్యపేట ఒకప్పుడు పుష్కల నిధులతో అభివృద్ధిలో దూసుకుపోగా, నేడు పారిశుధ్య కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. ఇంటి పన్నులు వసూలు చేసి జీతాల బకాయిలు చెల్లిస్తున్నారని, అవి పూర్తిగా వసూలైతే అక్టోబర్ నుంచి జీతాలకు ఒక్క రూపాయి కూడా లేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు కూడా రూ.50 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉందన్నారు. నిధుల లేమితో కొన్నేళ్లుగా రోడ్లు, డ్రైన్లు వంటి కనీస వసతులు కూడా సమకూరడం లేదని చెప్పారు. పంచాయతీకి ఎన్నికలు సకాలంలో జరగలేదని, ఇప్పటికే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ఏటా రూ.రెండున్నర కోట్ల ఆర్థిక సంఘం నిధులను కోల్పోయామన్నారు. రెండేళ్లుగా స్టాంప్ డ్యూటీ కూడా విడుదల కావడం లేదన్నారు. స్థానిక శాసన సభ్యులు దీనిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి, స్టాంప్ డ్యూటీ విడుదల కావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కరపలో ప్రజా వేదిక

కాకినాడ రూరల్: మండల కేంద్రమైన కరపలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం పాల్గొన్నారు. ఇది మంచి ప్రభుత్వం అనే పేరుతో 100 రోజుల పరిపాలనను ప్రజలకు వివరించే కార్యక్రమంలో భాగంగా సంక్షోభంలోను సంక్షేమం కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే నానాజీ పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధి చేస్తే కబ్జా ముద్ర వేస్తారా?

- దుకాణాల తొలగింపు తీరు సరికాదు
- జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్

కాకినాడ: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన సంతచెరువు ఆలయ ప్రాంగణంలో ఆక్రమణలు, కబ్జాల పేరుతో దుకాణాలను తొలగించిన తీరు ఏ మాత్రం సమంజసం కాదని జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణంలో నిర్మించిన నాలుగు దుకాణాలు, ఈవో కార్యాలయం, ఇతర నిర్మాణాలను తొలగించిన తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. వాస్తవానికి ఎంతో చరిత్ర కలిగిన ఆలయాన్ని దాతల సహకారంతో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసి, ఆదాయం వచ్చేలా దుకాణాలు నిర్మించారన్నారు. ఇటువంటి సంప్రదాయం కాకినాడలోని అనేక ఆలయాల ప్రాంగణాల్లో ఇతర ప్రభుత్వ హయాంలో కొనసాగుతూనే ఉందన్నారు. ప్రతి నెలా ఆలయ నిర్వహణ కోసం ఖర్చయ్యే వేలాది రూపాయలు అక్కడ దుకాణాల అద్దె సొమ్ముతో నిర్వహణ కొనసాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వాస్తవాలను పక్కన పెట్టి, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరులు కబ్జా చేసిన దుకాణాలను తొలగించారంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. దాతలు ఇచ్చిన నిధులతో నిర్మాణాలు చేసి, వాటిని అధికారులకే అప్పగించారన్నారు. అద్దె సొమ్ము ఏ ఒక్కరి జేబుల్లోకి వెళ్లదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మరి కొద్ది రోజుల్లో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో, ఉన్న ప్రహరీని, మరుగుదొడ్లను, ఇతర నిర్మాణాలను తొలగించి భక్తులకు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ప్రతి నెలా వచ్చే ఆదాయాన్ని చెడగొట్టిన వ్యక్తులు.. అదే ఆదాయాన్ని సమకూర్చి భవిష్యత్తులో ఆలయ నిర్వహణకు తోడ్పాటును అందిస్తే ప్రతి ఒక్కరూ హర్షిస్తారని స్పష్టం చేశారు. సంతచెరువు ఆలయం వద్ద దుకాణాల తొలగింపు విషయంలో కబ్జాలు చేయడం కానీ, ఆక్రమించడం కానీ జరగలేదన్న విషయాన్ని ప్రజలకు కూడా తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే ఈ వివరణ ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలు చేసి, వ్యక్తిగత ప్రతిష్టను మంటగలిపేలా అభాండాలు వేయవద్దన్నారు.

వైద్య విద్యార్థినికి ఘన సత్కారం


తల్లిదండ్రులతో పాటు, భూమికను ఘనంగా సత్కరిస్తున్న సంఘ నాయకులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థిని తాడి భూమిక రెడ్డికి ఘన సత్కారం లభించింది. వివిధ విభాగాలలో 9 బంగారు పతకాలు సాధించి, వైద్య విద్యలో ఉన్నతంగా రాణించిన నేపథ్యంలో రెడ్డి సంక్షేమ సంఘం డాక్టర్ భూమికను ఘనంగా సత్కరించింది. కాకినాడలోని రెడ్డి సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు సత్తి వీర్రెడ్డి, సత్తి కృష్ణారెడ్డి, వాడ్రేవు రవి మాట్లాడుతూ, భూమిక తన ఎంబీబీఎస్ జైత్రయాత్రనే నీట్‌లోనూ ప్రదర్శించిందన్నారు. రాష్ట్ర స్థాయిలో 53వ ర్యాంకు సాధించి తల్లిదండ్రులు, గురువులకు కీర్తి ప్రతిష్టలు ఆర్జించిందన్నారు. ఈ కార్యక్రమంలో భూమిక తల్లిదండ్రులు సహా కర్రి వీర్రెడ్డి, సంఘ నాయకులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, నల్లమిల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల బోధకులకు శిక్షణ


మెడికల్ ఎడ్యుకేషన్ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో బోధకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులతో కాంపిటేటివ్ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా కర్కిలం ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాం జరిగింది. మంగళవారం రాత్రి ఆర్ఎంసీ డిజిటల్ లైబ్రరీలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశి పర్యవేక్షణలో మెడికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన వైద్య విధానాలు, విద్యార్థులకు సులభతర బోధన అంశాలపై బోధన చేపట్టారు. ఆర్ఎంసీకి చెందిన 30 మంది బోధకులు ఈ తరగతులకు హాజరయ్యారు. డాక్టర్ అర్జుమన్ షేక్, డాక్టర్ నాజియా, డాక్టర్ మెర్సీ డేవిస్ శిక్షణలో బోధన జరిగింది. డాక్టర్ వాణి అబ్జర్వర్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతులను డాక్టర్ దేవీ మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు. రెండు రోజుల బోధనా ప్రణాళికలతో రూపకల్పన చేసిన ఈ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగియనుంది.

హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

పోలీసు అధికారుల హెచ్చరిక

కాకినాడ సిటీ: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ అమల్లోకి వచ్చిన నిబంధనను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పలువురు పోలీసు అధికారులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు అధికారి రఘువీర్ విష్ణు, ట్రాఫిక్ సీఐలు ఎస్ రమేష్, డి.రామారావు పాల్గొన్నారు. రహదారి భద్రత, పౌరుల బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాల్సిన ఆవశ్యకతను తెలిపారు. హెల్మెట్ ధరించిన వ్యక్తులు గతంలో జరిగిన పలు ప్రమాదాల్లో ప్రాణహాని లేకుండా, సురక్షితంగా బయటపడిన ఉదంతాలను ప్రెజెంటేషన్లతో విశదీకరించారు. విద్యార్థులు తమతో పాటు, వారి తల్లిదండ్రులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చైతన్యపరచాలని కోరారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఇప్పటి వరకూ కాకినాడ నగరం, రూరల్ పరిధిలోని మూడు కళాశాల్లోనూ, నగరంలోని ప్రధాన కూడళ్లు భానుగుడి జంక్షన్, మసీదు సెంటర్, బలరాం సెంటర్లల్లో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఈ అవగాహన, జనచైతన్య కార్యక్రమాలను నిర్వహించారు.

కేసుల నమోదు

మంగళవారం కాకినాడ నగరంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మందిపై కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్టు ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు తెలిపారు. వీరిలో 9 మందికి రెండు రోజుల వంతున జైలు, ఒకరికి రూ.10 వేల జరిమానా విధించినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ తనిఖీలు నిత్యం కొనసాగుతాయన్నారు.

లైంగిక వేధింపులపై సీఐడీ విచారణ చేయాలి

బీజేపీ నేత మాలకొండయ్య డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న మాలకొండయ్య. చిత్రంలో బాధితురాలు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ (ఐసీపీఎస్) కార్యాలయంలో మహిళా సోషల్ వర్కర్‌పై సహ ఉద్యోగి చదలవాడ వెంకట్రావు లైంగిక వేధింపుల సంఘటనపై సీఐడీ విచారణ జరపాలని బీజేపీ సీనియర్ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. మంగళవారం సాంబమూర్తినగర్‌లోని తన నివాసంలో బాధితురాలు విషభాతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీపీఎస్ కార్యాలయంలో సోషల్ వర్కర్ ఆర్ విషభాను తోటి ఉద్యోగి చదలవాడ వెంకట్రావు లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ విషయాన్ని బాధితురాలు కలెక్టర్, ఎస్పీలతో పాటు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పట్లో శిశు సంక్షేమ శాఖ అధికారులు ఓ కమిటీతో మొక్కుబడిగా విచారణ చేసి, వేధింపులు జరగలేదని నివేదిక ఇచ్చిందన్నారు. వెంకటరావుకు అనుకూలంగా కమిటీ సభ్యులు ఎటువంటి వేధింపులు జరగలేదని నివేదిక ఇచ్చి, ఫైలు మూసివేశారన్నారు. బాధితురాలిని రకరకాల ప్రశ్నలతో కమిటీ సభ్యులు వేధించారని ఆరోపించారు. లైంగిక వేధింపులకు రుజువులు కావాలని అడగడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని, లేకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మంచి సమాజానికి మహిళా విద్య అవసరం



విద్యార్థిని ప్రదర్శిస్తున్న భరత నాట్యం

కాకినాడ రూరల్: ఆడబిడ్డల చదువు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఓఎన్‌జీసీ ఆఫీసర్స్ మహిళా సమితి అధ్యక్షురాలు శ్వేతా సింగ్ చెప్పారు. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో మహిళా సార్థకత కోసం ఇస్ ఉమెన్ ఎంపవర్డ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శ్వేతా సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలానుగుణంగా తల్లిదండ్రుల్లో, సమాజంలో మార్పులు వచ్చి ఆడబిడ్డలను చదువు కోసం ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఇంకా ఏదో ఒక రూపంలో మహిళలు వారి కుటుంబ సభ్యులపై ఆధారపడుతూనే ఉన్నారన్నారు. ఓఎన్‌జీసీ చీఫ్ మేనేజర్ హెచ్ఆర్ ఎస్టాబ్లిష్మెంట్ డాక్టర్ ఎస్.మణి ముఖ్య వ్యాఖ్యాతగా మాట్లాడుతూ, భారతదేశంలో చాలామంది ఆడపిల్లలకు చదువు, కొన్ని హక్కులు ఉన్నా, ప్రతిరోజు ఏదో రూపంలో మహిళలపై దురాగతాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కొనడానికి స్త్రీ తన హక్కులను కాపాడుకుంటూనే, మరింత అభివృద్ధిని సాధించాల్సి ఉందని స్పష్టం చేశారు. ఎల్ ఇండియా ఉమెన్ కమిషన్ కాకినాడ ట్రెజరర్ పద్మజ వాణి, సభ్యులు రత్నగిరి ఉష మాట్లాడారు. అనంతరం ఓఎన్‌జీసీ వారి వాకతాన్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు, గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోచయ్య, రాధా మాధవి, డాక్టర్ నానిబాబు, డాక్టర్ గోపి, డాక్టర్ అజయ్ రతన్, డాక్టర్ హారిక, మనోజ్ దేవ, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విజయశ్రీ పాల్గొన్నారు.

లడ్డూపై అపఖ్యాతి తగునా!

ఆధ్యాత్మిక వేత్త దూసర్లపూడి

బోట్‌క్లబ్: రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూపై అపఖ్యాతి తగదని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. 2003లో వెయ్యి కాళ్ల మండపం తొలగించిన నాడే తిరుమల ఏడు కొండలపై శాశ్వత అపవిత్రత ఏర్పడిందన్నారు. పునర్నిర్మాణ పనులు చేస్తామన్నప్పటికీ చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపి వెయ్యి కాళ్ల మండపం పునర్నిర్మించి శాశ్వత పవిత్రతకు పాటుపడాలని కోరారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం అవకతవకలుంటే సరిచేసి, అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రసాదంలో జంతువుల అవశేషాల కల్తీ జరిగిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉండి కూడా, శాంతిహోమాలు, ప్రాయశ్చిత్త దీక్షల పేరిట చేస్తున్న ప్రపంచ వ్యాపిత రాజకీయ రగడ తగదన్నారు. తిరుపతి బాగుపడాలంటే స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో గౌరవ హోదాలో ఉన్న ఆధ్యాత్మిక, సీనియర్ సిటిజన్లను ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించాలన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: జిల్లా స్పోర్ట్స్ గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–17 ఫుట్‌బాల్ బాలబాలికల పోటీల్లో గౌతం శివసాయిశంకర్, అశ్విన్, హర్షిత్ విశ్వకర్మ, అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో సత్యం ప్రతిభ చూపారు. జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగులో ఆయుష్‌కుమార్, 200 మీటర్ల విభాగంలో సాయం చౌదరి ప్రతిభ ప్రదర్శించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి అభినందించారు.

దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్లు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ: వచ్చే దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కాకినాడ నగరంలోని 27, 28, 29, 31, 32, 34 డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదికగా కార్యక్రమం సినిమారోడ్డులోని అన్నదాన సమాజంలో నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ, గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుక అందజేస్తామన్నారు. నగరంలో గంజాయిని అరికట్టే చర్యలు చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన వంద రోజుల్లో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్‌వో శైలజ, మెప్మా సిటీ మేనేజర్ డి వెంకట్రాజు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

కాకినాడ రూరల్: కళాశాలలో ఇంటర్ స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులను వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు ఏర్పాటు చేసిన విభాగమే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అని వీఎస్ఎల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రాఘవరావు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో వీఎస్ఎల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో చదువు, విజ్ఞానంతో పాటు సమాజంపై బాధ్యతను, సమస్యలపై అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు. రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ, సమాజ అవసరాలను గుర్తించడం, వాటి పరిష్కారంలో విద్యార్థులు పాల్గొనేటట్లు చేయడం దీని ఉద్దేశమన్నారు. తొలుతగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి కే.సుకన్య, రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: 35, సరిపోదా శనివారం, హైడ్ ఎన్ సీక్, మత్తు వదలరా 2
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్: గొర్రె పురాణం, 35, సరిపోదా శనివారం, 100 కోట్లు
లక్ష్మి: ట్రాన్స్‌ఫార్మర్స్
సత్యగౌరి: గొర్రె పురాణం
తిరుమల: టికెట్
సీఅండ్‌సీ1: మత్తు వదలరా 2
సీఅండ్‌సీ2: బొమ్మరిల్లు
శ్రీప్రియ: అయ్
పద్మప్రియ: సరిపోదా శనివారం
సూర్య (వాకలపూడి): గొర్రె పురాణం
సూర్య2: సరిపోదా శనివారం